

పెద్దచెరువుకట్ట పూడ్చివేత పనులను ప్రారంభిస్తున్న మంత్రి సారథి

చెరువుల మరమ్మతులకు రూ.4 కోట్లు మంజూరు

- మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, సెప్టెంబరు 21 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నూజివీడు పెద్దచెరువుకు గండిపడి నూజివీడు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు తీవ్రనష్టం జరిగిన విషయం తెలిసిందే. నియోజక వర్గంలో వివిధ చెరువులకు కూడా గండ్లుపడ్డాయి. ఈ నేపథ్యంలో పెద్దచెరువుతో పాటు మిగిలిన చెరువుల గండ్లను తాత్కాలికంగా పూడ్చడానికి రూ.4 కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పెద్దచెరువు కట్టపై సంబంధిత పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దచెరువు పరిధిలో ఆక్రమణల కారణంగా చెరువులో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి అధిక వర్షాలతో వరద నీరు చేరడంతో చెరువుకు గండ్లు పడ్డాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చెరువు గట్లపై ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. నియోజకవర్గంలో చెరువులకు పడిన గండ్ల వల్ల రూ.22 కోట్ల నష్టం జరిగిందన్నారు. గండ్లు కారణంగా రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో మొదటి విడతలో వీటికి యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టే నిమిత్తం రూ.4కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

శశికుమార్‌ను శిక్షించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 21 : విద్యార్థినులపై అఘాయిత్యానికి పాల్పడిన హాస్టల్ వార్డెన్ శశికుమార్‌ను కఠినంగా శిక్షించాలని, విద్యార్థినులకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో సీట్లు ఇవ్వాలని, మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద శనివారం సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ విద్యార్థి సంఘం ధర్నా నిర్వహించారు. శశికుమార్‌ను ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎ.రవి, డేగా ప్రభాకర్‌రావు, రాజనాల రామ్మోహన్‌రావు, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.




లైన్‌క్లియర్..





నీరు-చెట్టు పథకం బిల్లులకు మోక్షం



- చేసిన పనులకు రూ.కోట్లాది బిల్లులను ఐదేళ్లు నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం
- ఓ వర్గంవారే చేశారంటూ కక్ష సాధింపు
- కొందరు కోర్టులకెక్కి బిల్లుల సాధింపు
- పాత బిల్లులను చెల్లించండంటూ తాజాగా కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- సరాసరిన రూ.40-రూ.50 కోట్ల చెల్లింపులకు అవకాశం

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

భూగర్భ జలం పెరగాలి. చెరువులు, కుంటలు పరీవాహకంలో ఉన్న వ్యవసాయ భూములకు నీరందాలి. పచ్చని వాతావరణం అంతటా విస్తరించాలి. 2014-19 మధ్య సాగిన ఈ యజ్ఞంలో పెద్ద సంఖ్యలో స్థానికులు మమేకమయ్యారు. ఎక్కడికక్కడ చిన్న, మధ్యతరహా జల వనరుల్లో పూడికను తొలగించారు. ఈ ప్రక్రియకు అవసరమైన ఖర్చును ముందస్తుగా తామే భరించి ప్రభుత్వానికి బిల్లు పెట్టారు. కొంతలో కొంత కొన్ని పనులకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోనే చెల్లింపులు జరిగాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పనులపై కక్ష పెంచుకుంది. కేవలం కొంతమందికి బిల్లులు చెల్లించి మరికొందరికి నయాపైసా ఇవ్వలేదు. దీనిపై పెద్ద ఎత్తున రైతులు కోర్టుకెక్కారు. గడిచిన ఐదేళ్లల్లో వారిలో కొందరికి మొక్కుబడిగా బిల్లులు ఇచ్చారు. ఇప్పుడు కోర్టుకెక్కిన వారికే కాకుండా పనులు చేసిన అందరికీ బిల్లులను చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

అన్నీ పరిశీలిస్తున్నాం

నీరు-చెట్టు పథకం కింద ఇప్పటికే కోర్టుకెక్కిన వారికి బిల్లుల చెల్లింపులో త్వరితగతిన నిర్ణయాలు తీసుకున్నాం. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకం కింద 2014-19 మధ్య వివిధ నియోజక వర్గాల్లో పనులు భారీగానే సాగాయి. వాటన్నింటిలో కొన్నింటికి బిల్లులు చెల్లించగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మధ్యనే ఈ పనులకుగాను ఏలూరు డివిజన్ పరిధిలో రూ.నాలుగున్నర కోట్లకు పైగానే చెల్లించాం. ఇంకా మిగిలిన అనేక బిల్లులను పరిశీలించి ఆ మేరకు మంజూరు చేస్తాం.

- దేవప్రకాశ్, జల వనరుల శాఖ ఎస్ఈ

నీరు + చెట్టు = బాకీ

రాజకీయాల్లో కక్షపూరిత చర్యలు ఎలా ఉంటాయో గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం అందరికీ చుక్కలు చూపించింది. 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రవేశపెట్టిన పథకాల్లో ముఖ్యమైనది నీరు-చెట్టు పథకం. నియోజకవర్గాల వారీగా చిన్న, మధ్యతరహా చెరువులు, కుంటలన్నింటిలోనూ పేరుకుపోయిన పూడిక అయా జల వనరుల నీటి నిల్వ సామర్థ్యాన్ని దెబ్బతీసింది. దీనికితోడు భూగర్భ జలాలను ప్రభావితం చేసింది. పరీవాహకంలో ఉన్న భూములకు నీరందించలేని పరిస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితులపై అధ్యయనం చేసిన అప్పటి ప్రభుత్వం భూగర్భ జలాలు మరింత పెంచేందుకు, వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు నీటి వనరులను అందుబాటులోకి తేవడం లక్ష్యంగా తీసుకుంది. దీంతో ఎక్కడికక్కడ అవసరాలను గుర్తించి పనులను రైతులకే అప్పగించింది. ఉన్నంతలోనే బిల్లులు మంజూరు చేసేందుకు ప్రయత్నాలు చేసింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన వినూత్నమైన ఈ పథకం అమలులో తామూ భాగస్వాములు కావాలనే ఆతృతతో అనేక మంది ముందుకొచ్చి పనులు చేస్తామని ప్రభుత్వానికి నివేదిక అందించారు. కిందిస్థాయి అధికారులు వీటిని ఆమోదించారు. ఈ లెక్కన అప్పట్లోనే దాదాపు ఉమ్మడి పశ్చిమ గోదావరిలో దాదాపు రూ.140 కోట్లకు పైనే నీరు-చెట్టు పనులు సాగాయి. మధ్యతరహా చెరువుల న్నింటిలోనూ పూడిక తొలగి ఆ స్థానంలో పుష్కలంగా నీరు చేరింది. చిన్న నీటి వనరుల్లోను ఇదే కళ కనిపించింది. చేసిన పనులన్నింటికి బిల్లులు ఇచ్చేందుకు అప్పట్లో ప్రయత్నించారు. కాని ఎప్పుడైతే 2019లో రాష్ట్రంలో వైసీపీ అధికార పగ్గాలు చేపట్టిందో సీను తిరగబడింది. టీడీపీ హయాంలో పనులకు మేమెందుకు బిల్లులు ఇస్తామనే ధోరణిలో బిల్లులను తొక్కిపెట్టింది. ఈ పనులన్నింటిలోనూ అవకతవకలు జరిగాయని, విచారణ జరిపిస్తామని బీరాలు పలికింది. కాని ఎక్కడా పట్టుమని పది చెరువుల్లో జరిగిన పనులను విచారించలేకపోయారు. కేవలం ఈ పథకం కింద ఒక సామాజిక వర్గానికి చెందిన వారే అత్యధికంగా లబ్ధి పొందారంటూ కొత్తగా బిల్లులు మంజూరేవీ లేవంటూ మొరాయించారు.

బిల్లుల కోసం కోర్టులకు..

జగన్ సర్కార్ బిల్లుల చెల్లింపులో మొండికేయడంతో ఈ పథకం కింద పనులు చేసిన వారిలో అనేక మంది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. దీంతో ఎవరైతే కోర్టు గడపతొక్కారో అలాంటి వారందరికి జగన్ పాలనలో దాదాపు రూ.20 కోట్లు బిల్లులు అతికష్టం మీద చెల్లించారు. అదికూడా కోర్టు మొట్టికాయలు వేస్తేనే సాధ్యమైంది. కాని ఈ పథకం కింద పనులు చేసిన వారందరికీ ఇంకా రమారమి 40-50 కోట్లు చెల్లించాల్సి ఉంది. తాజాగా సీఎం చంద్రబాబు సైతం తక్షణం పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లులను చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడంతో ఆ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. సాధ్యమైనంత త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా ప్రభుత్వం కోరింది. దీంతో జల వనరుల శాఖ కొద్దిరోజులుగా ఎవరెవరికి బిల్లులు చెల్లించాల్సి ఉందో నిర్ధారించుకుంటూ భారీ కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే దాదాపు ఏడేళ్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న వారందరికీ బిల్లులు చేతికందే అవకాశం ఉంది.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యాధికారుల ధర్నా

గైర్హాజరీ వైద్యాధికారులకు నో వర్క్.. నో పే

- సీహెచ్‌సీలకు రోగులను తరలించేందుకు 108 వాహనాలు
- కొనసాగుతున్న పీహెచ్‌సీల డాక్టర్ల సమ్మె

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21 : పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా కోసం గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యాధికారులు 11 రోజులుగా చేస్తున్న దశలవారీ ఆందోళనలో భాగంగా ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద చేస్తున్న నిరసన ప్రదర్శన, ధర్నా శనివారం కొనసాగాయి. మరోవైపు విధులకు గైర్హాజరైన వైద్యాధికారులకు 'నో వర్క్-నో పే' విధానాన్ని అమలు చేయాల్సిందిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నుంచి శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. సమ్మెలో పాల్గొంటున్న డాక్టర్లందరికీ సంబంధిత రోజులకు జీతంలో కోతపెట్టి బిల్లులు తయారు చేయాల్సిందిగా పీహెచ్‌సీల డీడీవోలను ఆదేశించారు. ఇక వైద్యాధికారుల సమ్మెతో క్షేత్రస్థాయిలో వైద్యసేవలకు అంతరాయం కలుగకుండా వైద్యఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయ చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రాథమిక వైద్యాన్ని స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందించినప్పటికీ ఎవరికైనా తదుపరి మెరుగైన వైద్యం అవసరం ఉన్నట్టుగా గుర్తిస్తే వెంటనే 108లో సీహెచ్‌సీలకు రిఫర్‌చేసి పంపించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఆదేశాలు జారీ చేశారు. శనివారం జిల్లాలో మొత్తం 93 మంది వైద్యాధికారులు విధులకు గైర్హాజరయ్యారు.

ప్రభుత్వ ధోరణి మారాలి : వైద్యుల డిమాండ్

ఇన్ సర్వీస్ కోటాను సగానికి తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 85 ఉత్తర్వులను వైద్యాధికారులకు సానుకూలంగా ఉండేలా సవరిస్తామని ఇటీవల చర్చల సందర్భంగా హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు ఆ దిశగా ఇంతవరకు చర్యలు తీసుకోక పోవడం పలు సందేహాలకు తావిస్తోందని ఏపీ పీహెచ్‌సీల డాక్టర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రకుమార్ ఆరోపించారు. ఇన్ సర్వీస్ కోటాను యథాతథంగా కొనసాగిస్తూ ప్రభుత్వం వెంటనే జీవో 85కి సవరణలు చేయాలని, అప్పటివరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. సంఘ నాయకులు కళ్యాణి మహేశ్వరి, జ్ఞానేష్, పూర్ణిమ, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

మహాపాపం..

- తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పెల్లుబికిన నిరసన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21 : తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం వైసీపీ హయాంలో కల్తీ అయినట్టు తెలియడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది మహాపాపమని, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పోతిరెడ్డిపల్లిలో గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. కోదండ రామాలయం ట్రస్టు సభ్యుడు అక్కినేని జెనర్థీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. లడ్డూ తయారీలో ఆవు నెయ్యికి బదులుగా జంతు కొవ్వులను వినియోగించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ అక్కినేని చందు, మాజీ ఎంపీటీసీ అక్కినేని సుజాత, సుంకర సూర్యప్రకాశరావు, గారపాటి కృష్ణ ప్రసాద్, అక్కినేని రంగారావు తదితరులు పాల్గొన్నారు.



పోతిరెడ్డిపల్లిలో నిరసన తెలుపుతున్న భక్తులు

వేంకటేశ్వరస్వామికి వినతిపత్రం

ఏలూరు రూరల్ : తిరుమలలో లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ చేయడం దారుణమని ఇందుకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఆర్.ఆర్‌పేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీనెయ్యి వాడకాన్ని ప్రోత్సహించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. చేసిన పనులు కప్పిపుచ్చుకునేందుకు జగన్ చంద్రబాబును విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకుడు కె.కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు

మండవల్లి : శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించడంపై విచారణ చేయాలని మండవల్లి హిందూ భక్త సమాజం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో షిర్డీ సాయి భక్త సమాజం కన్వీనర్, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, గురుస్వాములు యర్రంశెట్టి శ్రీనివాసరావు, లంకిశెట్టి చలపతిరావు, ఆజాద్, నల్లమోతు సురేంద్ర, కట్టా శ్రీనివాసరావు, కరేటి రమేష్, గుడివాడ మురళీ, రాజేష్, నాగబాబు పాల్గొన్నారు.



హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ దంపతుల పాదయాత్ర

ముదినేపల్లి : శ్రీవారి లడ్డూ తయారీలో అపవిత్రతతకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని హిందూ ధర్మాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ పెయ్యేరు ఆటోనగర్‌కు చెందిన జనసేన కార్యకర్తలు పుప్పాల శేషు, అతని భార్య లక్ష్మీ ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం వరకు శనివారం ఐదు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. మద్దతుగా సింగరాయపాలెం దేవాలయాల అర్చకులు, యాజ్ఞికులు ఆసూరి రంగనాథాచార్యులు, పృథ్వీ, సుదర్శన్, ఆసూరి రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతి మహా ప్రసాదం, లడ్డూలో కల్తీ నెయ్యిని వినియోగించి హిందూత్వాన్ని దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇది క్షమించరాని నేరమని మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు డిమాండ్ చేశారు.





వానొస్తే..మునకే

- కొద్దిపాటి వర్షానికే నగరంలోని రోడ్లన్నీ జలమయం
- అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ.. నగర వాసుల పాట్లు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 21 : ఏలూరులో శనివారం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డ్రెయిన్లలోని మురుగు, రోడ్లపైన వర్షపునీరు కలిసిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఓ మాదిరికి వర్షానికే ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయిందంటే డ్రెయినేజీ వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పవర్‌పేట రైల్వే స్టేషన్, ఆర్ఆర్.పేట, కృష్ణమూర్తి కాలనీ, ఎల్ఐసీ ఆఫీస్, అశోక్‌నగర్, పత్తేబాద వన్‌టౌన్‌లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయింది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని నగరవాసులు కోరుతున్నారు.



ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు



వర్ధినీడి కృష్ణమూర్తి గారి వీధి..

జాతీయ రహదారుల భూసేకరణ అంశాలపై సమీక్ష

ఏలూరు రూరల్, సెప్టెంబరు 21 : జిల్లాలో నిర్మితమవుతున్న పలు జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ విషయంపై కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం అధికారులతో సమీక్షించారు. జేసీ బి.ధాత్రిరెడ్డి, ఏలూరు, నూజివీడు ఆర్డీవోలతో పాటు జాతీయ రహదారి ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ట్రాన్స్‌కో, సి.ఆర్, గనుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో జిల్లాలో నిర్మితమవుతున్న పలు రహదారుల భూసేకరణకు సంబంధించి అవరోధాలను అధిగమించాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో రవీంద్ర దామా, పుష్పమణి, ఆర్డీవోలు ఎస్.ఎస్.కె ఖాజావలీ, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు చెత్త ఉంటే.. రూ.500 జరిమానా

చింతలపూడి, సెప్టెంబరు 21 : చింతలపూడి నగర పంచాయతీలో పారిశుధ్యం మెరుగుదలకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇకపై ఇంటి ముందు చెత్త ఉంటే జరిమానా విధిస్తామంటూ శనివారం మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ఇంటి ముందు చెత్త ఉంటే రూ.500, దుకాణాల ముందు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటే రూ.1,000, హోటళ్ల ముందు చెత్త ఉంటే రూ.2,000 జరిమానా విధిస్తామంటూ నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ శారద హెచ్చరికలు జారీ చేశారు.



భాస్కరరావుపేట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్. చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం..

ప్రజల ఆకాంక్షల మేరకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. కలిదిండి మండలం భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్ ఆవరణలో, మండవల్లి మండలం కొవ్వాడలంకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిన 100 మంచి పనులను వివరించారు. గ్రామ పంచాయతీలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తులతో శ్రీవారి క్షేత్రం కిటకిట



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 21: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన ద్వారకా తిరుమల శనివారం భక్తజనులతో కిటకిటలాడింది. స్వామి వారికి ఇష్టమైన రోజుకావడంతో వాతావరణం సరిగా లేకున్నా అధికసంఖ్యలో యాత్రికులు ఆలయానికి విచ్చేశారు. వారంతా స్వామివారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు12 వేలమంది వరకూ యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆక్వా యూనివర్సిటీలో 25 మంది చేరిక

నరసాపురం రూరల్, సెప్టెంబరు 21: ఆక్వా యూనివర్సిటీ అడ్మిషన్లకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో నరసాపురం కాలేజీలో 25 మంది చేరినట్లు డీన్ నీరజ చెప్పారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయన్నారు. రెండోవ కౌన్సెలింగ్‌లో మొత్తం ఫుల్ అయ్యే అవకాశం ఉందన్నారు. మొత్తం 565 మంది ర్యాంకులు సాధించారన్నారు. వీరిలో 120 మందికి మాత్రమే అడ్మిషన్లు ఉంటాయన్నారు. నెల్లూరు జిల్లాతో పాటు నరసాపురంలోని కాలేజీలో కౌన్సెలింగ్ ద్వారా మొత్తం సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పురుషోత్తమ కుమార్

చట్టాలపై మరింత నైపుణ్యం పెంచుకోవాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : మారుతున్న చట్టాలపై మరింత నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ చట్టాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ వర్క్‌షాపుల వల్ల ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలియని విషయాలను తెలుసుకోవచ్చునన్నారు. ఈ వర్క్‌షాపులో 138 నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్‌యాక్టు చట్టం, పరిధి, తీర్పులను అమలు పర్చడం, బాలలపై లైంగిక దాడులు, విచారణ, బాధితుల పరిహారం అనే అంశాలపై ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రరాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి శ్యాంసుందర్, రిటైర్డ్ జిల్లా జడ్జి కృష్ణయ్య, హైకోర్టు న్యాయవాది జంపన శ్రీదేవి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ ప్రారంభం



ప్రార్థనా శ్లోకాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 21: సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతున్న సరస్వతి శిశు మందిరాలు అలనాటి గురుకులాలను తలపిస్తున్నాయని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ళ వీరాస్వామి అన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఎంఈవో ప్రారంభించారు. ప్రధానాచార్య బెజవాడ సూర్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయిని నందుల రమణి జ్యోతి ప్రజ్వలన చేశారు. సైన్స్ ఫెయిర్‌లో గణిత, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 15 పాఠశాలల నుంచి 224 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి జగదీష్, జాన్సీరాణి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శిశుమందిరం అధ్యక్షుడు వీవీ తిరుపతిరాజు, కార్యదర్శి బోడా సత్యజిత్ కుమార్ పాల్గొన్నారు.

24న అండర్-14, 17 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 : ఈనెల 24న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-14, 17 జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు గోపాలపురం మండలం వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8:30 గంటల నుంచి జరుగుతున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం, మిడ్‌డే మీల్స్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు పీడీ వెంకటేశ్వరరావు సెల్ నెంబర్ 79819 28003 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మాజీ బ్యాంక్ మేనేజర్ నుంచి రక్షణ కల్పించాలి



మాజీ మేనేజర్‌పై ఆరోపణలు చేస్తున్న గ్రామస్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: బ్యాంక్ మేనేజర్ పని చేసిన సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన మర్రిబంధంకు చెందిన దావులూరి ప్రభావతి వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు గ్రామస్థులు కోరారు. నూజివీడులో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన అవిర్నేని పద్మాకరరావు, మండవ విజయలక్ష్మి, దోనవల్లి పద్మాకరరావు, దోనవల్లి వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ కిలేడీగా ప్రసిద్ధి గాంచిన ప్రభావతి గంగూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా అవకతవకలకు పాల్పడి సస్పెండ్ అయ్యిందన్నారు. ప్రభావతి బంధువులమైన తమను అక్కడి వారు ప్రశ్నించగా ఇదేమని అడిగినందుకు సొంత మేనమామనైన తనపైనే రేప్ కేసు పెడతానని ప్రభావతి బెదిరింపులకు దిగిందని కంభంపాటి సుజయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సోదరికి రావాల్సిన వారసత్వ ఆస్తులను సైతం అక్రమంగా పొందిందని, అదేకాక ఆమె ఇంటి చుట్టుపక్కల వారిని సైతం బెదిరిస్తూ దాడులకు దిగుతోందని దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా రౌడీషీట్ కూడా నమోదైందని అయినా ఆమె పద్ధతి మార్చుకోలేదని వారు ఆరోపించారు. హనీట్రాపర్‌గా మారి రేప్ కేసులు పెడతానని మరి కొంత మందిని వేధిస్తోందని ఇందుకు సంబంధించి ప్రభుత్వ పెద్దల పేర్లు వాడుకుంటోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

రెండు కేజీల గంజాయి పట్టివేత

నరసాపురం, సెప్టెంబరు 21: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి గంజాయ్ తరలిస్తున్న ముగ్గురు యువకుల్ని అరెస్టు చేసి వారి నుంచి దాదాపు రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ముత్యాలరావు చెప్పారు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో సోదా చేయగా గంజాయి బయటపడిందన్నారు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు అన్న విషయాన్ని విచారిస్తున్నట్లు ఎస్సై చెప్పారు

మార్టేరు వరిపరిశోధనా స్థానం రూపకల్పన

దాళ్వాకు ఎంటీయూ 1426 వరి వంగడం



వరి పరిశోధనా స్థానంలో వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెనుమంట్ర, సెప్టెంబరు 21 : మార్టేరు వరి పరిశోధనా స్థానం నుంచి ఎంటీయూ 1426 అనే నూతన రకాన్ని రూపొందించామని సహాయ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రకం 120 రోజుల పంటకాలం కలిగి కేవలం 13.6 గ్రాముల వేయి గింజల బరువు కలిగి ఉండటం వల్ల తినడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ రకాన్ని ఈ దాళ్వా పంటకాలంలో చిరు సంచి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మార్టేరు వరి శోధనా స్థానంలో డ్రోన్ అందుబాటులో ఉన్నదని, మండల వ్యవసాయ అధికారులు ఈ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కోతలు మొదలైన ప్రాంతాలలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగుచేస్తున్న అన్ని రకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజారాణి మాట్లాడుతూ వివధ పురుగు మందులు, తెగులు మందుల కలయిక, చిరు సంచుల రకాల సమాచారం గురించి వివరించాలని తెలిపారు. కొందరు రైతులు ఈ నెలలో కూడా నారుమళ్ళు పోస్తున్నారని, దీనివల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని, దానికి బదులుగా నవంబర్ మాసంలో దాళ్వా నారుమళ్ళు పోసుకోవచ్చని తెలిపారు. డా.ఎం.వి.కృష్ణాజీ పాల్గొన్నారు.

సార్వాలో ఎండాకు తెగులు

పరిశీలించిన వ్యవసాయశాఖ జేడీ

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

పెనుమంట్ర, సెప్టెంబరు 21 : నత్తా రామేశ్వరంలో వరి పొలంపై ఎండాకు తెగులు ఆశించిన పొలాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర్లు పరిశీలించారు. శనివారం పెనుమంట్ర మండలం విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎండాకులు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 24వ తేదీ నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం మొదలవబోతున్నదని, శాస్త్రవేత్తలంతా తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజారాణి మాట్లాడుతూ వివిధ పురుగు మందులు, తెగులు మందుల పిచికారిపై రైతులకు అవగాహన కల్పించారు.

వచ్చే నెల 30న ఉపాధ్యాయ ఓటర్ల తుది జాబితా

ఏలూరుసిటీ, సెప్టెంబరు 21: రాష్ట్ర శాసనమండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా డ్రాఫ్టు పబ్లికేషన్ ఈనెల 24వ తేదీన విడుదల చేయబడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఉపాధ్యాయ ఓటర్ల సమీకృత జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు 30వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా 2331 మంది క్లెయిమ్స్ అందజేయగా వాటిని పరిశీలించిన తర్వాత 2271 దరఖాస్తులను పరిష్కరించటం జరిగిందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 20 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించటంలో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, రాజకీయ పక్షాల ప్రతినిధులైన రాజనాల రామ్మోహనరావు, రంభ కిషోర్ (కాంగ్రెస్) , నెరుసు నెలరాజు (బీజేపీ), ఎ.రవి , డీఎన్‌వీడీ ప్రసాద్ (సీపీఎం), ఎస్.అచ్యుతబాబు, యు బాలానందం (టీడీపీ), ఎన్.కాశీ నరేష్ (జనసేన) పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం
ముగ్గురికి గాయాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై వంకా పోతురాజు (50), వంకా దుర్గాప్రసాద్ (25), కోట సాయి (12) కలిసి ఒకే వాహనంపై జంగారెడ్డిగూడెం పట్టణంలోని గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి దర్శనం నిమిత్తం బయలుదేరి వచ్చారు. ఆలయంలో స్వామి వారి దర్శనం అనంతరం ద్విచక్ర వాహనంపై ఆలయ కొండ దిగుతుండగా ఘాట్ రోడ్‌లో టర్నింగ్ తిరుగుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చిన్నపాటి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ కు సమాచార మందించి క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. ప్రమాద ఘటన స్థలాన్ని ఎస్సై ఎస్‌కె.జబీర్ పరిశీలించారు.

గోదావరిలో మునిగి వృద్ధుడి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 21: గోదావరిలో మునిగి వృద్ధుడు మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన పొలుబోను వెంకట్రావు(62) ఈ నెల 20న అనారోగ్యంగా ఉందని రాజమహేంద్రవరం వెళ్లి వైద్యం చేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వచ్చారు. తిరిగి ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. శనివారం కొవ్వూరు భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద మృతదేహం గోదావరిలో ఉందన్న సమాచారం తెలియడంతో బంధువులు చూడగా వెంకట్రావుదిగా గుర్తించారు. మృతుడి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

రైలు నుంచి జారిపడి అస్సోం వాసి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : వేగంగా వె ళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అస్సోం వాసి మృతి చెందాడు. అస్సోంనకు చెందిన రామెన్ లింబో (44) తాగ్రాం నుంచి న్యూటిస్కియోకు వెళ్తున్న రైలు ఎక్కాడు. ఆ రైలు ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సీతంపేట రైల్వే గేటు సమీపంలో వెళ్తుండగా ఆ రైలు భోగీలో ఉన్న రామెన్ లింబో భోగీ గుమ్మంలోంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

మొగల్తూరు,సెప్టెంబరు 21: అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇసుక లోడుతో ఉన్న ఈ ట్రాక్టర్‌లను మొగల్తూరులోని స్థానిక హైవే ఖాళీ ప్రదేశంలో పోలీసులకు అప్పగించేందుకు ఉంచారు. దీనిపై మొగల్తూరు ఎస్ఐ జి.వాసును వివరణ కోరగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులే సీజ్ చేశారని తమకు అప్పగించలేదన్నారు.

భార్యను హింసిస్తున్న అత్తింటివారిపై కేసు

ముసునూరు, సెప్టెంబరు 21: భార్యను హింసిస్తున్న భర్త, అతని బంధువులు ముగ్గురిపై ఏఎస్ఐ ఎన్.నాగభూషణరావు శనివారం కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన టిక్కోడియా క్రిస్టఫర్, ముసునూరు మండలం గోపవరానికి చెందిన గుడిసె పావని పూజిత ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది నెలలుగా భర్త క్రిస్టఫర్, అతని తమ్ముడు స్టీవెన్, అత్తమామలు నక్కా రమాదేవి, సుబ్బారావు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద పార్క్ చేసిన తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం గ్రామానికి చెందిన పట్టెల ప్రదీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూలై పదవ తేదీన పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రదీప్ కుమార్ మేనల్లుడు చికిత్స పొందుతుండగా పరామర్శించడానికి వచ్చి తన హెచ్ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనాన్ని ఆసుపత్రి బయట పార్కు చేసి లోపలికి వెళ్ళాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనబడలేదన్నారు.ఇప్పటి వరకూ వాహనాన్ని పలుచోట్ల వెదకి కనబడక పోవడంతో శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జబీర్ తెలిపారు.

పరీక్ష రాయడానికి వెళ్తూ అనంత లోకాలకు..

బుల్లెట్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు.. ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

ఒకరిది విజయవాడ, మరొకరిది భీమవరం.. తుని మండలం ఎర్రకోనేరు వద్ద ఘటన



ప్రమాద దృశ్యం



నిరంజన్, రేవంత్(ఫైల్‌ఫొటో)

తుని రూరల్, సెప్టెంబరు 21: పరీక్ష రాసేందుకు విజయవాడ నుంచి విశాఖకు బుల్లెట్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను కారు రూపంలో మృత్యువు కబళించింది. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన గంటకే ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోవడంతో వారికి కడుపుకోత మిగిలింది. కాకినాడ జిల్లా 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని మండలం ఎర్రకోనేరు వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పరీక్ష కోసం తెల్లవారుజామున పయనమై..

విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నాదెండ్ల నిరంజన్(19), పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్(19) ఇద్దరూ స్నేహితులు. వీళ్లు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరికీ శనివారం మధ్యాహ్నం విశాఖపట్నంలో ఎంపీటీఎల్ పరీక్ష ఉండడంతో బుల్లెట్‌పై తెల్లవారుజామున విజయవాడ నుంచి బయల్దేరారు. అలా వస్తూ.. వస్తూ ఓచోట ఆగి తమ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి క్షేమంగానే వెళ్తున్నామని ఇరువురూ సమాచారం అందించారు. కాకినాడ జిల్లా తుని రూరల్ ఎర్రకోనేరు వచ్చేసరికి విశాఖపట్నం వెళ్తున్న కారు వీళ్ల బుల్లెట్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో వీళ్ల ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టగా యువకులు ఇద్దరూ ఎగిరిపడ్డారు. హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రంగా గాయపడ్డారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరినీ అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇద్దరినీ స్థానికంగా తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాల పాలైన నాదెండ్ల నిరంజన్ ఆస్పత్రికి వెళ్లేసరికి మృతి చెందాడు. మరో యువకుడు పోలిశెట్టి రేవంత్ కూడా తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడు కూడా మృత్యువుతో పోరాడి వెంటిలేటర్‌పై తుదిశ్వాస విడిచాడు. ఈ సంఘటనపై తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కారులో ప్రమాద సమయంలో ముగ్గురు ఉన్నారని, వారిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని మృతుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

క్షేమంగా వెళ్తున్నామంటూ విగతజీవులుగా మారి..

భీమవరానికి చెందిన పోలిశెట్టి రేవంత్‌కు తల్లిదండ్రులు ఉండగా అతడి స్నేహితుడు నిరంజన్‌కు తల్లి ఒక్కరే ఉన్నారు. ఇటీవలే తండ్రి మృతి చెందగా తల్లి భవాని ఉన్న ఒక్క కొడుకును అపురూపంగా పెంచుకుంటున్నారు. తుని ఏరియా ఆస్పత్రివద్ద విగతజీవిగా ఉన్న కొడుకు మృతదేహాన్ని చూసి ఆమె బోరున విలపించింది. ప్రమాదానికి ఒక గంట ముందే క్షేమంగా వెళ్తున్నామని చెప్పాడని, కాసేపటికే కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడని తెలిసిందని ఆమె రోధించారు.



పేరుపాలెం బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న కలెక్టర్ నాగరాణి

సముద్ర తీరాన్ని రక్షించుకుందాం

మొగల్తూరు/నరసాపురం రూరల్, సెప్టెంబరు 21: భూమండలంలో ముఖ్యవనరుల్లో సముద్రం ఒకటని, కాలుష్యం నుంచి జల, జీవరాశులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం పేరుపాలెం బీచ్‌లో చేపట్టిన స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. తీరం వెంబడి చెత్త, ప్లాస్టిక్, పర్యావరణ హానికరమైన ఇతర వ్యర్థాలను ఏరివేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్రాలు లెక్కలేనన్ని జీవరాశులకు ఆశ్రయాన్ని ఇస్తూ భూమిపై వాతావరణాన్ని నియంత్రిస్తున్నాయన్నారు. తీర ప్రాంతాన్ని కూడా పరిరక్షించుకుంటే అనేక వేల పక్షి జాతులను పరిరక్షించుకోవచ్చన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు పడేసే వ్యర్థాలు కారణంగా తీర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారువుతున్నాయన్నారు. పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా 20 బోట్లతో గస్తీ ఏర్పాటు చేయాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, కొవ్వలి రామ్మోహన్ నాయుడు, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్. జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చినలంక సముద్రం ఒడ్డున స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. చినలంక గ్రామస్థులతో పాటు వేములదీవి ఈస్ట్, వెస్ట్ గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు సముద్రపు ఒడ్డున ఉన్న చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. సర్పంచ్ ఒడుగు ఏసు, టీడీపీ మండల అధ్యక్షుడు వాతాడి ఉమా పాల్గొన్నారు.

ముళ్లపూడికి పితృ వియోగం





వెంకటరత్నం పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మద్దిపాటి, బొలిశెట్టి

నల్లజర్ల, సెప్టెంబరు 21: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తండ్రి ముళ్లపూడి వెంకటరత్నం(76) శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. అనారోగ్యంతో విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. టీడీపీ సీనియర్ నాయకులుగా పార్టీకి అనేక సేవలందించారు. ఆయన భార్య విజయలక్ష్మి 2001లో నల్లజర్ల సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన నాయకత్వ లక్షణాలను కుమారుడు బాపిరాజు అందిపుచ్చుకున్నారు. వెంకటరత్నం పార్థివదేహానికి ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు ఈతకోట తాతాజీ, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి నాయకులు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, యలమాటి శ్రీనివాసరావు, ఏలేటి సత్యనారాయణ, గొంటుముక్కల వేణు నివాళులర్పించారు. వెంకటరత్నంకు బాపిరాజుతోపాటు మరో ఇద్దరు కుమారులు రామకృష్ణ, సురేంద్ర ఉన్నారు. ఆయన పార్థివదేహానికి ఆదివారం ఉదయం 11 గంటలకు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

ఏలూరుపాడులో పోలీస్ పికెటింగ్



ఏలూరుపాడులో పోలీసు పికెటింగ్ ఏర్పాటు

కాళ్ళ, సెప్టెంబరు 21 : ఏలూరుపాడులో ఫ్లెక్సీల తొలగింపు వివాదం నేపథ్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు వినాయకుడు, సాయిబాబా, నాగేంద్ర స్వామి ఆలయాలకు అడ్డుగా అంబే డ్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో పాటు నాగేంద్రస్వామి పుట్టపై కూర్చుని ధూమపానం చేస్తున్నారని వాటిని తొలగించాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీని పరిశీలించి స్వయంగా తొలగించారు. దీనిపై దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి మరొక ఫ్లెక్సీని అంబేద్కర్ విగ్రహం కింద ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై ఎమ్మెల్యే రఘురామ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అంటే తనకు ఎంతో గౌరవమన్నారు. గ్రామస్థులు ఎంతో పవిత్రంగా భావించే నాగేంద్రస్వామి పుట్టపై కూర్చుని కొందరు పొగతాగుతూ, ఉమ్మి వేయడం వంటి పనులు చేస్తున్న వీడియోలు చూపించారన్నారు. కనీసం గుడిలోకి వెళ్ళడానికి కూడా వీలు లేకుండా అడ్డుగా ఫ్లెక్సీలు కట్టడంతో భక్తులు కిందకు వంగి ఆలయానికి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడటం గమనించానన్నారు. దేశనాయకుల విగ్రహాలను అడ్డు పెట్టుకుని హిందూ దేవాలయాలపై దాడికి పాల్పడితే సహించేది లేదన్నారు. గ్రామంలో కొంత మంది వ్యక్తులు ఎస్సీలు కాకుండా ఎస్సీలమని చెప్పుకుంటూ అట్రాసిటీ చట్టాన్ని ఉపయోగించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనిపై పోలీసు ఉన్నతాధికారులను కలిసి వివరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీలమని చెప్పుకుంటున్న సదరు వ్యక్తులు ఎస్సీలే కాదని వారికి ఎస్సీ సర్టిఫికెట్స్ ఎలా ఇచ్చారంటూ దానిని రద్దు చేయాలని గ్రామానికి చెందిన పలువురు జనసేన, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు కాళ్ళ తహసీల్దార్ నాగార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఫ్లెక్సీల తొలగింపుపై ఉండి ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో దళిత సంఘాలు శనివారం రాస్తారోకో చేశారు.

ఏలూరులో దృష్టి మళ్ళించి చోరీలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : ఏలూరులో క్షణాల్లో సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు అపహరించుకుపోతున్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఉదయాన్నే బస్సు దిగిన ఒక వ్యక్తిని క్షణంలో మాయమాటలు చెప్పి ఆయన సెల్‌ఫోన్ తస్కరించారు. బస్టాండ్‌లో బస్ కోసం ఎదురుచూస్తున్న ఒక మహిళ ముందు ఏవో పేపర్లు పడవేసి అవి మీవేనంటూ దృష్టి మళ్ళించి ఆమె పరుసును అపహరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శనివారం ఒక ముఠా దృష్టి మళ్ళించి అక్కడ ఉద్యోగి సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. నగరంలో ఈ ముఠాలు సంచారం జరుగుతూనే ఉన్నాయి. రైతు బజార్లో కూడా చొక్కా జేబులో ఉన్న ఫోన్లను టవల్ అడ్డంపెట్టి, న్యూస్ పేపర్లు అడ్డంపెట్టో క్షణాల్లో తస్కరిస్తున్నారు. నగరంలో నేరస్తులపై నిఘా తగ్గిందని దీంతో బయట ప్రాంతాల నుంచి ఈ ముఠాలు వచ్చి దృష్టి మళ్ళిస్తున్నారని చెప్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వరుస చోరీలు.... జనం బెంబేలు

అత్తిలి, సెప్టెంబర్ 21 : మండలంలో వరుస చోరీలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ళల్లో చోరీలు మొదలుకొని ఆలయాలు, పంచాయతీ కార్యాలయాలు ఇలా ఏ ఒక్క ప్రదేశం వదలకుండా దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. కొన్ని నెలలుగా వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తిరుపతిపురం శివారు శివాపురం ఇంట్లో పట్టపగలే దొంగతనం జరగ్గా, మంచిలి డప్పింగ్ యార్డు వద్ద రాత్రి సమయంలో నాలుగు లక్షల 50 వేలు విలువ చేసే బంగారం దోచుకుపోయారు. పాలి పంచాయతీకి సంబంధించిన చెత్త రిక్షాలు బ్యాటరీలు ఎత్తుకు పోయారు.


బర్రింకలపాడు గురుకుల పాఠశాల క్రీడా పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

విద్యార్థులకు క్రీడలతో మంచి భవిష్యత్

జీలుగుమిల్లి, సెప్టెంబరు: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నియోజకవర్గ స్థాయి అండర్ 14-17 క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చి విద్యార్థులంతా పోలవరం నియోజకవర్గానికి జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా క్రీడలు ఆయా పీఇటీల ఆధ్వర్యంలో జరిగాయి. 7 మండలాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ప్రిన్సిపల్స్ స్వామి, శర్మలు కో-ఆర్డినేటరు పి.లక్ష్మణ్, పీఇటీలు రామారావు, బాబురావు, మునేష్, రాజశేఖర్ ఉన్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారు


మట్లాడుతున్న కొప్పాక శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బ తీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని వెల్లడి కావడం విస్మయం కలిగించిందన్నారు. గత ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి ఈ విషయంపై చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో ధార్మిక పరిషత్ ఏర్పడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కల్తీ లడ్డూ వ్యవహారంపె సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అడపా రత్తయ్య పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న మొడియం నాగమణి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 21: ఆశా వర్కర్ల వేతనాలను పెంచాలని, ఫిబ్రవరి 9న ప్రభుత్వం జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవో, సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో జి.మంగతాయారు అధ్యక్షతన శనివారం జరిగిన మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లతో ఇతర పనులు చేయించడం, సబ్ సెంటర్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోవాలని ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. ఆశా వర్కర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్నవారిని ఆశా వర్కర్లుగా గుర్తించాలని, సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పోశమ్మ, భవానీ, బేబి, గంగాదేవి, పోసిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం, ఖాతాదారుల అభివృద్ధికి కృషి


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పర్సన్ ఇన్‌చార్జి

పెదపాడు, సెప్టెంబరు 20: సహకార సంఘం అభివృద్ధి, ఖాతాదారులకు మెరుగైన సేవ లందించడానికి కృషి చేస్తామని గోగుంట, పెదపాడు సొసైటీల పర్సన్ ఇన్‌చార్జి మూర్తి తెలిపారు. పెదపాడు సొసైటీ సర్వ సభ్య సమావేశం సీఈవో సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగింది. మూర్తి మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి రూ.71.64 లక్షల నికర లాభం రాగా, మెంబరు షేర్ ధనంపై 12 శాతం డివిడెండ్ అందించామన్నారు. ఏటా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలతో పాటుగా సంఘ సభ్యులు ఇద్దరు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు రూ 10 వేలు చొప్పున ఇచ్చామన్నారు. మాజీ అధ్యక్షుడు గారపాటి స్టాలిన్, గుత్తా అనిల్, గారపాటి హరికృష్ణ మందపాటి వెంకటేశ్వరరావు, మోరు సూర్యనారాయణ, నెక్కంటి కలిక్కేశ్వరరావు, గారపాటి నాని, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ బంజారా సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక


గుగులోతు కృష్ణనాయక్ జి.రాజబాబు నాయక్

చింతలపూడి, సెప్టెంబరు 21: ఎస్టీ బంజారా, సుగాలి, సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు చింతలపూడిలో శనివారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా గుగులోతు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శిగా దారావతు రాజబాబు నాయక్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా బూక్యా నాగేశ్వరరావు, కీమ్లా నాయక్, ఎల్.వెంకటేశ్వరరావు, బోడా బాలు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ నాయక్, రాజబాబు నాయక్ మాట్లాడుతూ గిరిజన, లంబాడీలు, సుగాలీలకు రాజకీయ పదవుల్లో అవకాశం రావడం లేదన్నారు. తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని, ఫిబ్రవరి 14న సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటిస్తూ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని, భూమిలేని గిరిజన లంబాడీలకు రెండు ఎకరాల పోడుభూమి కేటాయించాలని, ఎస్టీ సబ్ ప్లాన్ నిధి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘ బలోపేతానికి కృషిచేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సంఘ సంస్కర్త గురజాడకు నివాళి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21: మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని శనివారం పలు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, పెరియార్ మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల అడుగుజాడల్లో నడవాలన్నారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ సంఘ సంస్కరణకు, సాహిత్య సంస్కరణలకు గురజాడ తన రచనల ద్వారా మార్గదర్శనం చేశారన్నారు. అధ్యాపకులు పరమేశ, వెంకట్రావు, విజయ్‌కుమార్, పద్మావతి, వెంకట దుర్గాప్రసాద్, కృష్ణచైతన్య, కావ్యశ్రీ, సుజాత తదితరులు పాల్గొన్నారు. సీఆర్ఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ విష్ణుమోహన్ మాట్లాడుతూ కవిగా, సంఘ సంస్కర్తగా సాంఘిక అసమానతలను రూపుమాపడానికి గురజాడ కృషి చేశారన్నారు. తెలుగు హెచ్‌వోడి మేడసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాడ ఆదునిక తెలుగు సాహిత్య యుగకర్త, చిరస్మరణీయుడని, ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం ఈనాటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రిన్సిపాల్ రామరాజు, వైస్‌ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. సెయింట్ ఆంథోని స్కూలులో ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్, నర్సింగ్, రాకేష్, జ్యోతి, దాసు, సుధీర్ తదితరులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్త్రీ విద్యకోసం కృషిచేసిన గురజాడ కారణజన్ముడని పేర్కొన్నారు.

● భీమడోలు: గుండుగొలను జడ్పీ హైస్కూలులో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. కైలా సత్యదీప్ చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో గురజాడ చిత్రపటానికి హెచ్‌ఎం సునీత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కో ఆర్డినేటర్ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెం, పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బాలరాజు, చింతమనేని, ఏలూరులో ఎమ్మెల్యే చంటి, కె.కోట మండలంలో నేతల ప్రచారం

హామీల అమలు

ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభల్లో నేతలు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 21: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రూపొందించి అమలు చేస్తున్న కార్యక్రమం 'ఇది మంచి ప్రభుత్వం' అన్నారు. వీరన్నపాలెం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, మంచినీటి ట్యాంకులు, కమ్యూనిటి హాలు, విద్యుత్ సమస్య, ఎన్‌హెచ్ ద్వారా నష్టపోతున్నవారిని ఆదుకోవాలని, కాలనీలు, ఇళ్ళు ఇప్పించాలని గిరిజనులు కోరారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాల్లో గర్భిణులకు సీమంతం, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయిబాబా, ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఈవోపిఆర్‌డి శ్రీహరి, ఎటిడబ్ల్యు శ్రీవిద్య, సీడీపీవో తులసీ, ఏవో డి.ముత్యాలరావు, ఏపీఎం, ఏపీవో, కార్యదర్శి కూటమి నాయకులు సచివాలయం ఉద్యోగులు పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

నెహ్రూబొమ్మ సెంటరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. ప్రజలు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు అండగా ఉండాలని సూచించారు. నల్లూరి కృష్ణమోహన్, కొండేపాటి రామకృష్ణ, ఎం.మోజేష్, మాటూరి ముసలయ్య, కుందుల శ్రీను, వి.కృష్ణంరాజు, ఎం.బుచ్చిరాజు, కె.శివాజి గంగాభవానీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: కామయ్యపాలెంలో జనసేన, టీడీపీ నేతలు బండారు అనిల్‌కుమార్, శీమకుర్తి శ్రీనివాసరావు వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, వరద బాధితులకు సాయం అంశాలను ప్రజలకు వివరించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీల అమలును ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

● చింతలపూడి: కూటమి ప్రభుత్వం సంక్షోభంలోనూ సంక్షేమం అందించిందని పట్టణంలోని చార్లెస్ నగర్‌లో నాయకులు బందెల ఆశీర్వాదం, పక్కాల వెంకటేశ్వరరావు, కోండ్రు దేవ తదితరులు ప్రచారం చేశారు. కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డులో కొత్తపూడి శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రసాద్, నారాయణ, బట్టువారిగూడెం దారా వీరేంద్ర ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

● కామవరపుకోట: గుంటుపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి బ్రోచర్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావు మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పరిపాలన అందిస్తుందన్నారు. దీపావళి నుంచి కార్డుదారులకు గ్యాస్ ఉచితంగా ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, సర్పంచ్ గోరింక దాసు, కంఠమనేని పుష్పరాజ్యం అంజిమూర్తి, బాల వర్థిరాజు, నూతి లక్ష్మీనారాయణ, బేతిన వెంకట్రావు, మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి పాల్గొన్నారు.

● వేలేరుపాడు: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతిని కూటమి నాయకులు రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉచిత గ్యాస్ పంపిణీ దీపావళి నుంచి ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. సర్పంచ్ వెంకమ్మ, అమరవరపు అశోక్, సంజీవులు, కొమ్మన వెంకటేశ్వరరావు, రాంబాబు, రూపా శ్రీరాములు, కరుటూరి రాధాకృష్ణ, కోటిపల్లి ముత్యాలరావు, సుభాష్‌చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలపై పలు గ్రామాలలో సభలు నిర్వహించారు. గోపీనాథపట్నంలో స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. సర్పంచ్ పుత్సకాయల విష్ణు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఏర్పాటుచేసిన సభల్లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు ఇచ్చి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, వలవల తాతాజీ, తెలగారపు జ్యోతి, చిటికెల అచ్యుతరామయ్య, బీజేపీ నాయకులు ఎంఎస్ఆర్, కొప్పాక శ్రీనివాసరావు, జనసేన నాయకులు చింతలనాని, టీడీపీ నాయకులు అల్లూరి రామకృష్ణ, చెరుకూరి శ్రీధర్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, చిట్రోజు తాతాజీ,చేను ప్రసాద్, షేక్ యాకూబ్, మారిశెట్టి బాల చిట్టెమ్మ, గుళ్ళపూడి శ్రీదేవి, నాయుడు శ్రీను, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కె.వెంకటరమణ, ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు ఇంటింటికీ వెళ్ళి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సాయిల సత్యనారాయణ, ఎలికే ప్రసాద్, బూసా సత్యనారాయణ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు తగిన కార్యాచరణతో ముందుకెళ్లాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి తూతిక విశ్వనాథ్ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛతాహి సేవ, కొత్త పథకాలు, వంద రోజుల పాలన తదితర అంశాలపై సమీక్షించి, ఆయా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ. గీతిక, ఈవోపీఆర్డీ సూర్యకుమార్, ఈవోలు ఎం.శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రజల కష్టాల నుంచి గట్టెక్కించిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 7వ డివిజన్‌లో సమావేశం నిర్వహించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, ఉప్పాల జగదీష్‌బాబు, పూజారి నిరంజన్, అమరావతి అశోక్, పెద్దిబోయిన శివప్రసాద్, నాళం హనుమంతరావు, నగర కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

● పెదవేగి: ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం ద్వారా యువతను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్ళడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాట్నాలకుంటలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఘంటసాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాదు రవి, మంచినేని శ్రీనివాసరావు, అవిర్నేని శ్రీధర్ సుబ్రహ్మణ్యం, కొనకళ్ళ శివమణి, తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనక రాజు, సైదు సత్యనారాయణ, నేతల రవి, తలకొండ జమలయ్య, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● లింగపాలెం: రంగాపురం, ములగలంపాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధికి పునాది వేసిందన్నారు. కార్యక్రమంలో ముసునూరి రాము, మురళీకృష్ణ, వివిధశాఖల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పోలవరం: కొత్త పట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల ప్రభుత్వ పాలన విజయాలను ఇంటింటికీ వెళ్ళి వివరించారు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అత్తిలి సుబ్రమణ్యం, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


జీలుగుమిల్లి, పోలవరం మండలాలు, చింతలపూడి పట్టణం, వేలేరుపాడులో కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మార్కుల నమోదుకు టీచర్ల ఫోన్లు వద్దు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21: పాఠశాల విద్యాశాఖ ఇటీవల అప్‌డేట్ చేసిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్‌తో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ విద్యార్థుల మార్కులను టీచర్ల మొబైల్ ఫోన్‌ల నుంచి సంబంధిత యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కంప్యూటర్ లేదా ట్యాబ్‌లో నమోదుచేసే అవకాశం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. టీచర్ల మొబైల్ ఫోన్‌లో ప్రతీ విద్యార్థి మార్కులు నమోదు చేసేటపుడు అన్ని సబ్జెక్టుల మార్కులు ఒకేసారి నమోదుచేసే అవకాశం లేకపోవడంవల్ల ఒక్కో విద్యార్థి మార్కుల నమోదుకు కనీసం 20 నుంచి 30 నిమిషాల వ్యవధి పడుతోందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి కంప్యూటర్ లేదా ట్యాబ్‌లో నమోదుచేసే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. తరగతి ఆధారంగా కాకుండా ఇప్పటివరకు అమల్లోవున్న విధానం ప్రకారం సబ్జెక్టు ఆధారంగా ఆన్‌లైన్‌లో మార్కులు నమోదుచేసే అవకాశాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నిరోధానికి ప్రతిజ్ఞ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21: బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం శనివారం సీఆర్ఆర్ కళాశాలలో జరిగింది. చిన్న వయస్సులో వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కరస్పాండెంట్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యాపార పోకడలపై వర్క్‌షాప్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21: సిస్టమ్స్ అప్లికేషన్స్ డేటా ప్రాసెసింగ్ ఉత్పత్తులకు (ఎస్ఏపీ) సంబంధించి పరిశ్రమలు, మార్కెట్లలో వేగంగా వస్తోన్న కొత్త అవకాశాలను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎంబీఏ విద్యార్థినులకు శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఆర్థిక వనరులు, మానవ వనరులు, సరఫరా వ్యవస్థ, ఖాతాదారుతో సత్సంబంధాలు, నిర్వహణ వంటి ప్రధాన వ్యాపార విధులను ఒకే వేదికపై అనుసంధానం చేయడానికి ఎస్ఏపీ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని రిసోర్స్‌పర్సన్ సాయికృష్ణ వివరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి విజయలక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల రీసర్వేకు అధికారుల చర్యలు

పోలవరం, సెప్టెంబరు 21: వరదలకు దెబ్బతిన్న పంట పొలాలు రీసర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేస్తామని ఏవో కె.రాంబాబు రైతులకు హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలు, కొండవాగుల ఉధృతికి నీట మునిగి నష్టపోయిన పంటపొలాల రైతులు శనివారం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏవోకు సమస్యలు వివరించారు. సమీప రైతుల పేర్లు నష్టపరిహారం జాబితాలో ఉంచి, తమ పేర్లు లేకపోవడం అన్యాయమన్నారు. రైతుల సమక్షంలో రీసర్వే జరిపి న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయాధికారి రాంబాబు మాట్లాడుతూ సోమవారం రైతులు పాస్‌బుక్‌లతో తహసీల్దారు కార్యాలయం వద్దకు రావాలని, అర్హులైన గుర్తించి జాబితాలో చేరుస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు సర్వే సందర్భంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది కూడా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మిరియాల అంజి, నవుడు కనకారావు, కరిబండి సూర్యచక్రం, నల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలంపాలెంలో మధ్యాహ్న భోజనం తనిఖీ


భోజనం పరిశీలిస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యుడు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 21: తిరుమలంపాలెం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వీవీ కృష్ణ శనివారం పరిశీలించారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యాన్ని, విద్యార్థుల సంఖ్య, మెనూ అమలు, ఆహారనాణ్యత, రుచి పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను ఉపాధ్యాయులను అడిగితెలుసుకున్నారు.

లైంగిక దాడి సంఘటనపై సమగ్ర విచారణ జరపాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 21 : ఏలూరు అమీనాపేట బాలికల వసతి గృహంలో బాలికలపై జరిగిన లైంగికదాడి సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పార్టీలు, ప్రజా మహిళా విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. సంఘటనపై సీబీఐకి కేసు అప్పగించి కేసు దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

ఎన్జీవో సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మహిళా సంఘాల నేతలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 21: ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు యూనియన్ సంఘాల నేతలు, వివిధ శాఖల అధికారులు, అభిమానుల మధ్య శనివారం జరిగాయి. మహిళా విభాగం నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పలువురు ఉద్యోగులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రిటైర్డ్ ఎస్ఈ సతీష్‌కుమార్, ఎస్ఈ దేవప్రకాష్, రిటైర్డ్ ఎస్ఈ ఎంవీ కృష్ణారావు, ఎన్జీవో జేఏసీ నాయకులు ఆర్.ఎస్ హరినాథ్, శ్రీధర్‌రాజు, మహిళా నాయకులు కె.నాగమణి, నాగదేవి, కె.సునీత, మల్లిక, లీలారాణి, సత్యభారతి, ఝాన్సీ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమడోలు, సెప్టెంబర్ 21: కొల్లేరు వరదతో వేలాది ఎకరాల చేపలు, రొయ్యలు చెరువులు మునిగి నష్టపోయిన ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. భీమడోలులో శనివారం జరిగిన రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశానికి కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, కొల్లేరు వరదల వల్ల ఆక్వా రైతులకు వందల కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ఏలూరు రూరల్, కైకలూరు, మండవల్లి, పెదపాడు తదితర మండలాల్లో ఆక్వా రైతులకు ఎక్కువ నష్టం జరిగిందన్నారు. నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గుత్తికొండ వెంకట కృష్ణారావు, రామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం


నారా లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21: పట్టణంలోని విద్యావికాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 లక్షలు ఇచ్చారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందచేసినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ సతీష్ చంద్ శనివారం తెలిపారు. కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి ఉన్నారు.

● వేలేరుపాడు: పెదవాగు ప్రాజెక్టు వరదలతో దెబ్బతిన్న ఊటగుంపు గ్రామస్థులకు బుట్టాయిగూడెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పలివెల దావీదు ఆధ్వర్యంలో వంద కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, దుస్తులు, పంపిణీ చేశారు. సభ్యులు యోసేబు, కుమార్ పాల్, బషీర్‌పాల్, సాల్మాన్‌రాజు, డానియేలురాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కంసాలిగుంటలో డ్రోన్‌తో పురుగుమందు పిచికారి

ఉంగుటూరు, సెప్టెంబరు 21: కంసాలిగుంట గ్రామ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో క్షేత్రంలో మాస్టర్ ట్రైనీ సంధ్యారాణి ఆధ్వర్యంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారి చేయించారు. వరి పంటపై శనివారం కషాయాలు పిచికారి చేయించారు. సంధ్యారాణి మాట్లాడుతూ పంట పరిస్థితిని బట్టి రసం పీల్చే పురుగులు, లార్వా దశలో ఉన్న గుడ్లపై తగిన మోతాదులో పురుగు మందును పిచికారి చేయాలని రైతులకు వివరించారు.

గ్రంథాలయ సంస్థకు రూ.20 కోట్ల సెస్ బకాయిలు

భీమడోలు, సెప్టెంబర్ 21: జిల్లా గ్రంథాలయ సంస్థకు వివిధ శాఖల నుంచి రూ.20 కోట్ల సెస్ బకాయి రావాల్సి ఉందని కార్యదర్శి ఎం శేఖర్‌బాబు తెలిపారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శనివారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరు నగర పాలక సంస్థ నుంచి రూ.9 కోట్లు, గ్రామ పంచాయతీల నుంచి రూ.9 కోట్లు, మున్సిపాల్టీల నుంచి రూ.2 కోట్ల బకాయి ఉన్నాయన్నారు. సెస్ సొమ్ముతో గ్రంథాలయ భవన నిర్మాణాలు, మరమ్మతులు, మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. గ్రంథపాలకుడు శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు.
- **ఏలూరు రూరల్ :** దొండపాడులోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో జె.అండ్.జె అరుణోదయ విభిన్న ప్రతిభావంతుల విద్యాలయంలో ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెస్ట్రీజీమినిక్ తలతోటి, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ గూడపాటి కేశవరావు, కార్యదర్శి వి.రాజేష్, ఈవోపీఆర్డీ జి.మరిడయ్య, వార్డు మెంబర్లు, స్థానికులు పాల్గొన్నారు.
- కామవరపుకోట వరసిద్ధి వినాయక ఆలయం వద్ద సంకటహర చతుర్థి పూజలను భక్తులు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు.
- **చింతలపూడి :** జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో కళాజాత ప్రదర్శన జరిగింది. పారిశుధ్యం, పరిశుభ్రత, తడిచెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ కవర్ల నిర్మూలన, మొక్కల పెంపకం, శబ్దవాయు, నీటికాలుష్యం నివారణ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు.
- **పోలవరం :** సీపీఎం కార్యదర్శి ఏచూరి సీతారాం, మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ లోటు తీరనిదని గుడెల్లి వెంకట్రావు అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. తెల్లం రామకృష్ణ, తామా బాలరాజు, బొరగం భూచంద్రం, మడివి చలపతి పాల్గొన్నారు.
- **దెందులూరు :** మండల ప్రత్యేకాధికారిగా గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ శ్రీనివాసరావు నియమితులయ్యారు.
- **జంగారెడ్డిగూడెం :** ప్రజా సమస్యల పరిష్కార దిశగా నిరంతర పోరాటాలు సాగించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. మైసన్నగూడెంలో సీపీఎం గ్రామశాఖ మహాసభలు పిల్లి పోతురాజు అధ్యక్షతన జరిగాయి. సీతారాం ఏచూరి, ఆర్ఎస్ మృతికి సంతాపం తెలిపారు. మైసన్నగూడెం గ్రామ కార్యదర్శిగా జి.సూర్యకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిల్లి వెంకట సుబ్బారావు, పులపాకుల వీర్రాజు, మద్దాల మధు, బక్కయ్య, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


భీమడోలు మండలం సూరప్పగూడెంలో ఎలుకల మందు అందజేస్తున్న జేడీఏ పద్మజ, నిడమర్రు, ఏలూరు మండలాల్లో మందు పంపిణీ

రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

పెదపాడు, సెప్టెంబరు 21: రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని, ఎలుకల నిర్మూలన మందును ఉచితంగా అందజేస్తామని ఏవో వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. కొత్తూరులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించి, ఎలుకల మందును అందజేశారు. ఎలుకల కన్నాలను గుర్తించి మందు ఉంచడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

● నిడమర్రు: ఎలుకల నిర్మూలన కార్యక్రమం రైతులు కలసికట్టుగా చేపట్టడం ద్వారా నిర్మూలించవచ్చని అడవికొలను సర్పంచ్ పాలా వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామ సచివాలయంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బ్రోమోడిన్ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ నిమ్మల దొరబాబు, పోశింశెట్టి రాంమూర్తి, పైడికొండల శివాజీ, పాపోలు మురళీకృష్ణ, కోటిపల్లి రాధాకృష్ణ, జవ్వాది బాలాజి, పుప్పాల నారాయణస్వామి, ఓగిరాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: సూరప్పగూడెంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి అబిబాషా, కమీషనరేట్ నుంచి జేడీఏ పద్మజ, ఏడీఏ ఉషారాజకుమారి, లలిత సుధ, జి.ఫణికుమార్ రైతులకు బ్రోమోడయోలిన్ మందులను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టామని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బ్రోమోడయోలిన్ మందును అందుబాటులో ఉంచామని ఏవో ఉషారాణి తెలిపారు. ఈనెల 25 లోపు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రైతులను సూచించారు.

● ఉంగుటూరు: మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో 103 కిలోల బ్రోమోడయోలిన్ మందును నూరు శాతం రాయితీతో రైతులకు అందించామని ఏవో ఎన్‌వీఎస్.ప్రవీణ్ తెలిపారు. రైతులు ఇమ్మణ్ణి గంగాధరరావు, చిట్టూరి హరిబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జేడీఏ పద్మావతి అన్నారు. మల్కాపురంలో ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏవో హబీబ్ బాషా రైతులకు సూచనలు ఇచ్చారు. ఎలుకల మందు తయారీ, పొలాల్లోని బొరియల్లో పెట్టే విధానంపై వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, ఎంఏవో జీవనసంధ్య, తదితరులు పాల్గొన్నారు.



కలిదిండి సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని, కలెక్టర్ వెట్రి సెల్వి



ఆగిరిపల్లిలో మంత్రి సారథికి కూటమి నాయకుల సత్కారం



గోపవరంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

సుపరిపాలనే లక్ష్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో వక్తలు

కలిదిండి/మండవల్లి, సెప్టెంబరు 21 : సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ సుపరిపాలన అందించటమే ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శనివారం భాస్కర రావుపేట జడ్పీ హైస్కూల్ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కూటమి ప్రనభుత్వం 100 రోజుల పాలనలో పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. వృద్ధాప్య పెన్షన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచారన్నారు. అన్నా క్యాంటీన్లు పునః ప్రారంభించి నిరుపేదలకు రూ.5లకే భోజనం పెట్టి ఆదుకుంటున్న ప్రభుత్వం ఇది అన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బ తీస్తున్న 217 జీవోను రద్దు చేసిందన్నారు. ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చిందన్నారు. సొంత భూమి పరుల పాలవుతుందన్న భయాన్ని పోగొట్టారన్నారు. రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారన్నారు. కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రహదారుల మరమ్మతులకు తక్షణమే రూ.145 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇకపై వరద ముంపు నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై దృష్టి సారించాలని ఐఏఎస్ అధికారులకు సీఎం చంద్రబాబు బాధ్యతలు అప్పగించారన్నారు. ఉప్పుటేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, చేపల రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, టీడీపీ కో-కన్వీనర్లు బలే ఏసుబాబు, తేరా రమేష్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ, అధికారులు పాల్గొన్నారు. పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీరం చేసిందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండవల్లి మండలం కొవ్వాడలంకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిన పనులను కామినేని వివరించారు. ఎన్డీయే నాయకులు, కొల్లేటి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాల అమలు

కైకలూరు: రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్నందుకే ఇది మంచి ప్రభుత్వమని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరులోని 127వ, 119వ బూత్‌లో బూత్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 100రోజుల పాలనపై ప్రజలకు వివరించి స్టిక్కర్లను పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాషా, మండల ఉపాధ్యక్షులు ఎండీ ఉస్మాన్, బూత్ ఇన్‌చార్జి సబేరా బేగం, టీడీపీ సీనియర్ నేత వేములపల్లి కారుణ్య, అధికారులు పాల్గొన్నారు.

20 లక్షల యువతకు ఉపాధి : మంత్రి సారథి

నూజివీడు: రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారని, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కె.పార్థసారధి తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలోని 8వ వార్డులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలో ఇంక్యుబెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూజివీడు మార్కెట్ యార్డును రూ.2కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయటం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలోనే నూజివీడు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మంత్రి అన్నారు. శనివారం నూజివీడు పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు కాపా శ్రీనివాసరావు, రాజశేఖర్, చెరుకూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం ఈదర, కొత్తఈదర గ్రామాల్లో మంత్రి సారధి శనివారం సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆగిరిపల్లిలో జరిగిన బహిరంగ సభలో మంత్రి సారధి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. జనసేన నాయకులు శివరామకృష్ణ, బర్మా ఫణిబాబు, ఆగిరిపల్లి మండల సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రిని సత్కరించారు.

ముసునూరు: సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ గ్రామ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, యువనేత ఉప్పలపాటి గణేష్ అన్నారు. శనివారం గోపవరం, వేల్పుచర్ల గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో అమలు చేసిన పథకాలపై కూటమి నాయకులు, అధికారులు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేసి, ప్రతి ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ పెన్షన్ పెంపు, మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టడం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం తదితర హామీలను వందరోజుల్లో అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. డీఎల్‌పీవో సుందరి, ఎంపీడీవో జి.రాణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: కూటమి పాలనలో రాష్ట్రం సుసంపన్నం అవుతుందని టీడీపీ నాయకులు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, గార్లపాటి మారేష్ అన్నారు. నరసింహారావుపాలెంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు అంది కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

చాట్రాయి, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. చాట్రాయిలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో తిరుమల ఆలయానికి సరఫరా చేసే ఆవునెయ్యిలో జంతువుల కొవ్వు, చేప నూనె కల్తీ చేయటం క్షమించరాని నేరమని, టీటీడీ పాలక మండలిలో అన్య మతస్థులను, నాస్తికులను నియమించటం వల్ల ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగాయని, మళ్ళీ ఇలాంటి దుస్సాహసానికి ఎవరూ పాల్పడకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి నాయకులు ఆదిమూలం శర్మ, కనమతరెడ్డి ముత్తారెడ్డి, మేకపోతుల వెంకటేశ్వరరావు, తుమ్మల జగన్, కేశవ, రాయవరపు సీతారాములు పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి దేవస్థానం వెంగమాంబ అన్నదాన సత్రానికి నూజివీడు రైతులు నక్కా సత్యనారాయణ, రాజరాజేశ్వర కుమార్, వంకాయల కాశీ తదితరులు 12 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. 12 నెలలుగా కూరగాయలను పంపుతున్నట్టు నక్కా సత్యనారాయణ తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: నూజివీడు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల క్రీడా పోటీలు శనివారం ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర, నాగరాజు, వనజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

చాట్రాయి, సెప్టెంబరు 21: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అనుబంధ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పేదల సాగులో ఉన్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, పాఠశాలల పారిశుధ్య, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు విడుదల చెయ్యాలని, ఉపాధి పథకం కింద 200 రోజులు పనులు కల్పించాలని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చెయ్యాలని నినదించారు. సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు నారాయణరావుకు ఘన నివాళి

ముసునూరు, సెప్టెంబరు 21: వెనుకబడిన అక్కిరెడ్డిగూడెం ప్రాంతంలో ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి, ఆదర్శంగా నిలిచిన ఆదర్శ రైతు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు చదలవాడ నారాయణరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి మండవ కృష్ణచైతన్య అన్నారు. శనివారం అక్కిరెడ్డిగూడెంలో జరిగిన సంతాపసభలో ఆయన మాట్లాడారు. చెరుకు రైతుల హక్కుల కోసం చదలవాడ కృషిచేశారని రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు అన్నారు. నారాయణరావు కమ్యూనిస్టు పార్టీ ఆశయాలకు అనుగుణంగా జీవించారని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు పి.జమలయ్య అన్నారు. తొలుత నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు ముసునూరుకు మంత్రి పార్థసారథి

ముసునూరు, సెప్టెంబరు 21: ముసునూరు జడ్పీ పాఠశాలలో ఆదివారం జరిగే ఇది మంచి ప్రభుత్వం (ప్రజావేదిక)కు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు గుళ్ళపూడి, 11 గంటలకు వలసపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం ముసునూరులో 11.30 నిమిషాలకు మంచి ప్రభుత్వం బహిరంగ సభలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దళితులకు న్యాయం చేయాలని లోకేశ్‌కు వినతి

నూజివీడు, సెప్టెంబరు 21: జగన్ ప్రభుత్వం చేసిన మోసం వల్ల 13 దళిత, గిరిజన కుటుంబాలు రోడ్డున పడ్డాయని, గత వైసీపీ ప్రభుత్వం బడుగు, వికాసం అనే పథకం ద్వారా రూ.800 కోట్లు సబ్సిడీ రాయితీలు అందిస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని టీడీపీ దళిత నాయకుడు, ఆంధ్రప్రదేశ్ దళిత జేఏసీ నాయకుడు నత్తా నాగేశ్వరరావు శనివారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి దళితులకు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందచేశారు.

మోదీ పాలన దేశానికి అవసరం

చాట్రాయి, సెప్టెంబరు 21: ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ పాలన దేశానికి అవసరమని ఆ పార్టీ జిల్లా నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు అన్నారు. సూరంపాలెంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి బీజేపీ పెద్దపీట వేస్తున్నదన్నారు. నాయకుడు బజ్జూరి గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశ్యామలాంబ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు, సెప్టెంబరు 21: కైకలూరు శ్రీశ్యామలాంబ, శ్రీరామలింగేశ్వర స్వామివారు, శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానాల్లో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 52 రోజుల్లో భక్తులు సమర్పించిన హుండీల ఆదాయం శ్రీశ్యామలాంబ అమ్మ వారికి రూ.1,46,137, శ్రీరామ లింగేశ్వరస్వామివారికి రూ.9,126, శ్రీవెంకటేశ్వరస్వామివారికి రూ.35,948లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎండోమెంట్ తనిఖీ అధికారి వి. సుధాకర్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ లెక్కింపులో శ్రీమన్నారాయణ గోష్ఠి మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నట్లు ఆలయ ఈవో శేఖర్ తెలిపారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు

చాట్రాయి, సెప్టెంబరు 21: మండలంలోని చనుబండలో శనివారం సాయంత్రం తేనేటి సీతారాములు ఇంటి సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తున్న సమయంలో పెద్ద శబ్దంతో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి చెట్టు రెండుగా చీలిపోయిందని స్థానికులు చెప్పారు. అదృష్టవశాత్తు ఎవ్వరికి ప్రమాదం జరగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

బాణసంచా దుకాణంపై పోలీసుల దాడి

ముసునూరు, సెప్టెంబరు 21: చెక్కపల్లిలో అనుమతులు లేని బాణసంచా సామగ్రిని విక్రయిస్తున్న కొత్తగుంట్ల రాజేష్‌కు చెందిన దుకాణంపై ఇన్‌చార్జ్ ఎస్ఐ లక్ష్మణరావు శనివారం రాత్రి దాడి చేశారు. సుమారు రూ10వేలు విలువ గల వివిధ రకాల బాణసంచా సామగ్రిని సీజ్‌చేసి, యజమానిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరద బాధితులకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దోనేపూడి రంగారావు దంపతులు

ఉంగుటూరు, సెప్టెంబరు 21: ఎంత చేసినా కన్న ఊరి రుణం తీర్చుకోలేమని టీడీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత ప్రభుత్వ అధ్యాపకుడు దోనేపూడి రంగారావు అన్నారు. మండలంలోని కొయ్యగూరపాడులో జన్మించి, ఉద్యోగరీత్యా 48 ఏళ్ల క్రితం కైకలూరులో స్థిరపడిన ఆయన తన భార్య ప్రభావతితో కలిసి శనివారం స్వగ్రామం వచ్చారు. బుడమేరు వరదలో నిరాశ్రయులైన బాధితులకు తమవంతు సాయంగా రూ. 40 వేలు విలువజేసే 200 దుప్పట్లను పంపిణీ చేశారు. గ్రామంలో పుట్టి ఉద్యోగరీత్యా వేరే ప్రాంతంలో స్థిరపడినా సొంత ఊరిని మర్చిపోకుండా ప్రతిఏటా స్వగ్రామం వచ్చి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దోనేపూడి రంగారావు దంపతులకు ఈ సందర్భంగా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ దోనేపూడి కృష్ణకుమారి, గ్రామపెద్దలు పోతినేని ఆజాద్, అబ్దుల్ హఫీజ్, జోజిబాబు, దోనేపూడి పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి తహసీల్దార్ చేయూత

చాట్రాయి, సెప్టెంబరు 21: చాట్రాయి గొల్లగూడెంలో ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన రాశిమెంటి ఆనంద్(18) అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం మృతుడి కుటుంబానికి తహసీల్దార్ ప్రశాంతి రూ. 3 వేలు ఆర్థిక సాయం చేశారు.

బాల బాలికల రక్షణకు చర్యలు

ముసునూరు, సెప్టెంబరు 21: బాల బాలికలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. శనివారం ముసునూరులోని గురుకుల బాలికల పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతిగృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రక్షణ పరంగా ఏమైన సమస్యలు ఉన్నాయా, రాత్రి సమయాల్లో సెక్యూరిటీ ఎలా ఉంటుందీ ఆరా తీశారు. ఎటువంటి సమస్యలున్నా 1098, 100, 112 నంబర్లకు కాల్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, వార్డెన్లు, ఏఎస్ఐ నాగభూషణరావు, మహిళా పోలీస్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఎస్పీ ఆదేశాల మేరకు ముదినేపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల స్థాయి బాలికల వసతిగృహాన్ని శనివారం ఎస్ఐ వెంకట్ కుమార్, మహిళా పోలీస్, ఇతర సిబ్బంది తనిఖీ చేశారు. హాస్టల్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అనితకు సూచించారు. హాస్టల్ భవనం శిథిలం కావటంతో విద్యార్థినులను రాత్రిళ్లు అద్దెకు తీసుకున్న వేరే భవనంలో ఉంచుతున్నట్లు వెల్ఫేర్ ఆఫీసర్ తెలిపారు.

మాజీ బ్యాంక్ మేనేజర్ నుంచి రక్షణ కల్పించాలి



ఆరోపణలు చేస్తున్న గ్రామస్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: బ్యాంక్ మేనేజర్‌గా పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన మర్రిబంధంకు చెందిన దావులూరి ప్రభావతి వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు గ్రామస్థులు కోరారు. నూజివీడులో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన అవిర్నేని పద్మాకర రావు, మండవ విజయలక్ష్మి, దోనవల్లి పద్మాకరరావు, దోనవల్లి వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ కిలేడీగా ప్రసిద్ధి గాంచిన ప్రభావతి గంగూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా అవకతవకలకు పాల్పడి సస్పెండ్ అయ్యిందన్నారు. ప్రభావతి బంధువులమైన తమను అక్కడి వారు ప్రశ్నించగా ఇదేమని అడిగినందుకు సొంత మేనమామనైన తనపైనే రేప్ కేసు పెడతానని ప్రభావతి బెదిరింపులకు దిగిందని కంభంపాటి సుజయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సోదరికి రావాల్సిన వారసత్వ ఆస్తులను సైతం అక్రమంగా పొందిందని, అదేకాక ఆమె ఇంటి చుట్టుపక్కల వారిని సైతం బెదిరిస్తూ దాడు లకు దిగుతోందని దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా రౌడీషీట్ కూడా నమోదైందని అయినా ఆమె పద్ధతి మార్చుకోలేదని వారు ఆరోపించారు.

భార్యను హింసిస్తున్న భర్త, అత్తింటివారిపై కేసు

ముసునూరు, సెప్టెంబరు 21: భార్యను హింసిస్తున్న భర్త, అతని బంధువులు ముగ్గురిపై ఏఎస్ఐ ఎన్.నాగభూషణరావు శనివారం కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన టిక్కోడియా క్రిస్టఫర్, ముసునూరు మండలం గోపవరానికి చెందిన గుడిసె పావని పూజిత ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది నెలలుగా భర్త క్రిస్టఫర్, అతని తమ్ముడు స్టీవెన్, అత్తమామలు నక్కా రమాదేవి, సుబ్బారావు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

తాళాలు పగులగొట్టి చోరీ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలో చోరీ జరిగింది. కాలనీ వాసి వల్లభనేని రామకృష్ణ కుటుంబ సభ్యులు పనిమీద ఊరు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేరని గ్రహించి ఆగంతుకులు తలుపులు గడ్డపలుగుతో పగులగొట్టి 12 కాసుల బంగారం, 3 కేజీల వెండి, రూ. 45 నగదును చోరీ చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం

కైకలూరు, సెప్టెంబరు 21: కైకలూరు మండలం వింజరం పోల్‌రాజ్ పంట కాలువలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. శనివారం మృతదేహం పంటకాలువల లాకుల వద్ద ఉన్నట్లు గుర్తించి వీఆర్వో రవితేజ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి సుమారు 45 సంవత్సరాలు వయస్సు, 5.6 అంగుళాలు ఎత్తు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వరద బాధితులకు అప్సా రూ.10.34 లక్షల వితరణ

నూజివీడు టౌన్/నూజివీడు, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నూజివీడు నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి రూ.10.34 లక్షల చెక్కును అందించారు. యాజమాన్య సంఘం ఛైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇచ్చిన రూ. 80 లక్షలను మంత్రి సారథి ద్వారా లోకేష్‌కు అందజేస్తామన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి. నూజివీడు పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు సీఎం సహాయనిధికి రూ.25 వేలను మంత్రి పార్థసారథికి అందించారు.



ఎమ్మెల్యే కామినేనికి చెక్కు అందిస్తున్న కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

సొసైటీల సభ్యుల విరాళం రూ. 6.51 లక్షలు

కైకలూరు, సెప్టెంబరు 21: వరద బాధితుల సహాయార్థం కైకలూరు నియోజకవర్గ కోఆపరేటివ్ సొసైటీల సభ్యులు విరాళాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం వరహాపట్నంలోని ఆయన ఇంటి వద్ద నియోజకవర్గ సొసైటీ సభ్యులు రూ.6,51,375ల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు.

మండవల్లి: సీఎం సహాయనిధికి మండవల్లి వాసులు భక్తులు రూ.43వేలు నగదును కామినేనికి అందజేశారు. మండవల్లి మాజీ సర్పంచ్ చిట్టిబాబు, సామాజిక కార్యకర్త డాక్టర్ విజయకుమార్ నగదును అందజేశారు.



ఘనంగా ఆది వినాయకస్వామి ఊరేగింపు

కైకలూరు, సెప్టెంబర్ 21: కైకలూరులో కూరగాయలు, పూలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆది వినాయకస్వామి 50వ వార్షిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా స్వామివారి ఊరేగింపును, నిమజ్జనాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తీన్మార్ డప్పులు, మేళతాళాలు, శక్తివేషాలు, కోయవేషాలతో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొన్నారు. పోల్‌రాజ్ డ్రైన్‌లో స్వామివారిని నిమజ్జనం చేశారు.

చాట్రాయి: చాట్రాయి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినదించారు. ఊరేగింపు అనంతరం స్థానిక పెద్ద చెరువులో స్వామివారిని నిమజ్జనం చేశారు.

పోషకాహారంతో రోగాలు దూరం

చాట్రాయి, సెప్టెంబరు 21: ప్రతి రోజూ పోషకాహారం తీసుకుంటే రోగాలు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి అన్నారు. మండలంలోని తుమ్మగూడెం, సోమవరం గ్రామాల్లో శనివారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీలు పౌష్టికాహార ప్రదర్శనలు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకొనే విధానం, పోషకాహార లోపం వలన వచ్చే వ్యాధులపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం శేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శోభనాచలుడికి మరో మణిహారం

ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు

నూజివీడు, సెప్టెంబరు 21: ఆగిరిపల్లి శోభనాచల క్షేత్రానికి రెండున్నర కిలోమీటర్ల ఘాట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం కానుంది. మంత్రి కొలుసు పార్థసారథి రూ. 2 కోట్లు నిధులను సాధించారు. మొత్తం రూ.10కోట్లు నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. వీటిలో రూ.2 కోట్ల నిధులను ఉపాధి నిధుల నుంచి నుంచి మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వెయ్యి సంవత్సరాల కిందట కొండపై వెలసిన శోభనాచలస్వామిని దర్శించుకోవాలంటే 750 మెట్లు ఎక్కాల్సి వస్తోంది. మెట్లు ఎక్కలేని భక్తులు కొండ కింద ప్రతిష్ఠించిన స్వామివారిని దర్శించుకుని వెళుతుంటారు. ఘాట్‌రోడ్డు ఏర్పాటు అయితే మూలక్షేత్రానికి వెళ్ళటానికి బస్సు సౌకర్యం ఏర్పాటై భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నూజివీడు సబ్ జైల్లో ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

ఖైదీలకు ఉచిత న్యాయం

నూజివీడు, సెప్టెంబరు 21: న్యాయవాదులను నియమించుకోలేని ముద్దాయిలకు ఉచిత న్యాయసేవ అందించేందుకు కోర్టులు సిద్ధంగా ఉన్నాయని కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎస్.అరుణసారిక అన్నారు. నూజివీడు సబ్ జైల్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ముద్దాయిలకు సబ్ జైల్లో అందుతున్న సేవలను జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. డి.ఎల్.ఎస్.ఏ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ దత్తత గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 21: ఆగిరిపల్లి శివారు గ్రామమైన గోపాలపురంలోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల దత్తత గ్రామమైన కనసానపల్లిలో స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు గ్రామంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారని ఛైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు తెలిపారు. గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నదే తమ విద్యార్థుల లక్ష్యమని ప్రిన్సిపల్ నాగభాస్కర్ తెలిపారు. గ్రామంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పంచాయతీ అధికారులకు అప్పగించగా, వీరి కృషికి మెచ్చి సర్పంచ్ సంజీవయ్య, విద్యార్థులకు అభినందన పత్రాలు అందచేశారు. ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారాల ప్రదర్శన

కైకలూరు, సెప్టెంబరు 21 : బాలింతలు, గర్భిణులు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. శనివారం కైకలూరు 4వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార వంటలను తయారుచేసి ప్రదర్శించారు. స్కూల్ హెచ్ఎం ఆనందకుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

కైకలూరు, సెప్టెంబరు 21 : సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులు పంటలను కాపాడుకోవాలని కైకలూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్ గంగాధరరావు అన్నారు. శనివారం కైకలూరు మండలం వింజరం, వేమవరప్పాడు, రాచపట్నం గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలుకల నిర్మూలనకు ఎర తయారీకి 960 గ్రాములు నూకలు, 20 గ్రాములు మంచినూనె, 20 గ్రాములు బ్రోమోడయోలనిస్ మందు అవసరమన్నారు. ఇలా తయారుచేసిన మందును రైతులంతా కలసి పొలంగట్లు వెంబడి ఎలుకల బొరియల్లో పెట్టాలని వివరించారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్ దివ్య, సర్పంచ్ మంగారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో పొలం పిలుస్తోంది కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇకపై ప్రతీ మంగళ, బుధవారాల్లో అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

కలిదిండి, సెప్టెంబరు 21 : కలిదిండిలో శనివారం డీఎస్సీ అభ్యర్థులకు కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అందించిన ఉచిత స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ నాయకులు పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు ప్రసన్న కుమారి, రాజ్ మోహన్, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ కుమారి పాల్గొన్నారు.



నూజివీడులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



మండవల్లిలో ఉపాధ్యాయులకు సత్కారం

ఉపాధ్యాయులకు సత్కారం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 21: నూజివీడు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవంలో భాగంగా ఏడాదిలోపు పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జి.రాజశేఖరరావు, కె.పద్మావతి, సీ.హెచ్ మైథిలి, అబ్దుల్ మునాఫ్ తదితరులను సన్మానించారు.

మండవల్లి: మండవల్లిలో శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. మండవల్లి మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రామరాజు, అబ్దుల్ మస్తాన్, వి అనసూయ, వై భాస్కరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు బి శ్రీనివాస్‌రావు, ఎం జోసెఫ్, వి దయానందకుమార్‌లతో పాటు మండవల్లి మండలం నుండి ఎంపికై జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న సారమ్మ, పిచ్చేడును సత్కరించారు. అలాగే జిల్లా స్థాయి ఉత్తమ ఎంఈవో అవార్డు గ్రహీత డి. రామారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఈవో రత్నసునాదంను ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీపీ శ్రీరామ్‌దుర్గాప్రసాద్, సర్పంచ్ ఝాన్సీ పాల్గొన్నారు.